భీం నివాళికి సర్వం సిద్ధం

కుమురంభీం వర్ధంతి సందర్భంగా.. గోండు వీరుడికి నివాళులర్పించడానికి వేలాదిగా తరలి వచ్చే ప్రజల కోసం ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. భీం విగ్రహం, సమాధి వద్ద ముస్తాబు చేశారు. సభా వేదిక, దర్బార్‌లో కూర్చునేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అవగాహన కోసం స్టాల్‌లు, ప్రత్యేక ఫిర్యాదుల విభాగం, భోజన, నీటి వసతి, వాహనాల కోసం పార్కింగ్ సౌకర్యం, హెలిప్యాడ్, హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉచిత బస్సు సౌకర్యాలను, తదితరాలను సిద్ధం చేశారు. డీడీ రమాదేవి ఆయా ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు.

- న్యూస్‌టుడే, కెరమెరి


జోడేఘాట్‌కు వచ్చే జనాల కోసం షామియానాల ఏర్పాటు


సిద్ధంగా హెలిప్యాడ్


భోజనాల కోసం ఏర్పాట్లు..

ప్రాణరక్షణ కేంద్రాలు కావాలి..

● నేడు ప్రపంచ ట్రామా దినోత్సవం




ఇదే దిక్కు..

ప్రస్తుతం రిమ్స్‌లో ఉన్న ట్రామా కేర్ యూనిట్ ఇది. ప్రమాదాల బారినపడి ప్రాణాపాయ స్థితిలో వచ్చే బాధితులకోసం ఈ వార్డులో చికిత్సలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే మాత్రం రెండో అంతస్తులోకి తరలించాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ట్రామాకేర్ యూనిట్‌లు అందుబాటులో లేక ప్రమాదాలబారిన పడిన వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలనుకున్న ట్రామాకేర్ యూనిట్‌లు ప్రతిపాదనదశలోనే మగ్గుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారి 44, మంచిర్యాల నుంచి కుమురం భీం జిల్లా వాంకిడి మండలం గోయెగాం వరకు ఉన్న 94 కి.మీ.ల 363 నెంబరు రహదారి, నిర్మల్ జిల్లాలో భైంసా వరకు ఉన్న 61వ నెంబరు జాతీయ రహదారులు ప్రమాదకరంగా మారింది. ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం



అత్యంత ప్రమాదకరం



గుడిహత్నూర్ మండలం జాతీయ రహదారి-44పై ఉన్న మేకలగండి ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఏడాది కిందట జరిగిన ప్రమాదంలో నలుగురు, ఆ తరువాత చోటు చేసుకున్న ఆటో ప్రమాదంలో మరో ముగ్గురు, ఇటీవల జరిగిన ప్రమాదంలో అయిదుగురు చనిపోయారు.

నిర్మాణంలో క్రిటికల్ కేర్ భవనం



ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యమందించేందుకు రిమ్స్‌లో ప్రస్తుతం క్రిటికల్ కేర్ భవనం రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యాక రూ.11 కోట్లతో అత్యాధునిక యంత్ర పరికరాలు ఇందులో ఏర్పాటు చేయనున్నారు. ఇది త్వరగా పూర్తయితే ప్రాణాపాయ స్థితిలో వచ్చేవారికి ప్రాణప్రదాయినిగా మారనుంది.

మూలమలుపులతో..



మంచిర్యాల జిల్లాలోని జాతీయ రహదారి 363పై తాండూరు మండలంలో బోయపల్లిగేటు వద్ద చోటు చేసుకున్న ఆటో ప్రమాదం ఇది. ట్రామాకేర్‌లు అందుబాటులో లేక మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స అందజేశారు.

ఎందుకంటే!

ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకొని వారి కుటంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించటానికి 2013 నుంచి 'ట్రామా దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు (సెప్టెంబరు వరకు)

జిల్లా	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఆదిలాబాద్	202	92	154
నిర్మల్	284	111	291
మంచిర్యాల	384	134	325
కుమురంభీం	87	64	172

ప్రతిపాదన దశలోనే..

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 25 చోట్ల ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయటానికి 2022లో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో నిర్మల్, ఆదిలాబాద్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కాని అవి ప్రతిపాదన దశలోనే ఉండి పోయాయి.

ఉమ్మడి జిల్లాలో బ్లాక్ స్పాట్లు ఇవే..

◆ ఆదిలాబాద్ జిల్లాలో 44వ జాతీయ రహదారిపై జందాపూర్ ఎక్స్‌రోడ్డు, భోరజ్, మావల సమీపంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్డు, గుడిహత్నూర్ మండలం మేకలగండి, ఇచ్చోడ మండలం గాంధీనగర్, నేరడిగొండ మండలం కుప్టి, దూద్‌గండి, కొరటికల్ మూలమలుపు

◆ మంచిర్యాల జిల్లాలో ఇందారం, శ్రీరాంపూర్ ఎక్స్ రోడ్డు, సోముగూడెం, రేపల్లెవాడ, తాండూర్ రైల్వే గేటు, బోబెపల్లి బోర్డు ప్రాంతాలు.

◆ నిర్మల్ జిల్లాలోని 61వ జాతీయ రహదారిపై చిట్యాల, దిలావర్‌పూర్, కల్లూర్, నర్సాపూర్, నసీరాబాద్ ప్రాంతాలు

◆ కుమురంభీం జిల్లా గుండా వెళ్లే 363 జాతీయ రహదారిపై వాంకిడి, కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు, రెబ్బెన గోలేటి, తాండూరు ప్రాంతాల్లో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

తొలి రోజు కొత్త ఉపాధ్యాయుల ఉత్సాహం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ద్వారా నియామకమైన కొత్త ఉపాధ్యాయులు బుధవారం జిల్లాలో వారు ఎంచుకొన్న పాఠశాల విధుల్లో చేరారు. దీంతో యువ గురువులతో బడులు సందడిగా మారాయి. ఉన్నత పాఠశాలలకు కేటాయించబడిన స్కూల్ అసిస్టెంట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుల వద్ద నియామక పత్రాలు, పోస్టింగ్ ఉత్తర్వులతో పాటు విధుల్లో చేరుతున్న రిపోర్టు అందజేశారు. చేరిన తొలి రోజున యువ ఉపాధ్యాయులు కొత్త అనుభూతిని పొందారు. సీనియర్లతో శుభాకాంక్షలు అందుకొన్నారు. పరిచయాలు, మిఠాయిల పంపిణీ, పాఠశాలపై అవగాహన పొందడంలో నిమగ్నమయ్యారు. ఈ నెల 15న కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల పోస్టింగ్ ఉత్తర్వులు పొందిన 270 మంది ఉపాధ్యాయులు జిల్లాలోని పాఠశాలల్లో ఉదయం పూటే విధుల్లో చేరిపోయారని విద్యాశాఖాధికారులు తెలిపారు.


జన్కాపూర్ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌బాబు వద్ద విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు నర్సింహామూర్తి, మల్లేష్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వాంకిడి, న్యూస్‌టుడే: పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాంకిడి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చరవాణి వినియోగం, మాదకద్రవ్య రహిత సమాజం అనే అంశంపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి, ప్రధానోపాధ్యాయుడు నటరాజ్, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి

● స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రాజకీయాలకతీతంగా జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని మొదట అటవీశాఖ అతిథి గృహం వద్ద కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మిలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎస్పీ శ్రీనివాస్ రావులతో కలిసి గుండి గ్రామంలోని జడ్పీ పాఠశాలలో ఉన్నతీకరించిన పదో తరగతిని ప్రారంభించారు. గుండి వాగుపై త్వరలో వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని, కనర్గాం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం జన్కాపూర్ జడ్పీ పాఠశాలలో బీహెచ్ఈఎల్ అందించిన సంచార సైన్స్ ల్యాబ్ వాహనాన్ని ప్రారంభించారు. సాంకేతికత అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లాకు శాశ్వత డీఈవోను నియమించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంత్రిని కోరారు.


మహిళా క్యాంటీన్‌లో చకినాలు కొనుగోలు చేస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభం

మహిళలను వ్యాపారపరంగా ప్రోత్సహించి ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కలెక్టరేట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించారు. ఫలహారాల రుచి చూశారు. అనంతరం 270 సంఘాలకు రూ.16 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.2 కోట్ల స్త్రీనిధి రుణాల చెక్కులు అందించారు. పీవీటీజీ గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద మంజూరైన వాహనాలను ప్రారంభించారు. వెనుకబడిన జిల్లాల్లో కొందరు వైద్య నిపుణులు పని చేసేందుకు రాకపోవడం సరికాదన్నారు. అనంతరం కుమురంభీం ప్రాజెక్టు వద్ద రూ.80 లక్షలతో నిర్మించిన టూరిజం భవనాన్ని ప్రారంభించారు. జలాశయంలో 90 వేల చేప పిల్లలు విడుదల చేశారు. తరువాత వట్టివాగు జలాశయం వద్ద కట్ట బలోపేతానికి సంబంధించి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, డీఎంహెచ్‌వో తుకారాం, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, డీఆర్‌డీవో దత్తారావు, డీపీవో భిక్షపతి, జిల్లా మత్స్య అధికారి సాంబశివరావు తదితరులున్నారు.

పొట్ట దశలో.. పుట్టెడు కష్టాలు!

● నీరందక ఎండిపోతున్న వరి పొలాలు.. రైతుల దిగులు




పెంచికల్‌పేట్ మండలం కొండపెల్లి పెద్ద చెరువు మత్తడి పూర్తిగా శిథిలమైంది. దీని కింద 500 ఎకరాలకు పైగా నీరివ్వాల్సి ఉన్నా.. 200 ఎకరాలకు కూడా అందడం లేదు. చివరి ఆయకట్టు పంటలు ఎండిపోతున్నాయి. మత్తడికి మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

తుంగ, పూడికతో..

వట్టివాగు జలాశయం కింద నిర్మించిన కాలువలకు మరమ్మతులు సరిగా చేయక చివరి వరకు నీరందడం లేదు. కొమ్ముగూడెం వద్ద కాలువలు మరీ అధ్వానంగా మారాయి. అప్పెల్లి, వద్ద ఉన్న డీ-5 సంబంధించిన షెట్టర్‌తోపాటు పలు ప్రాంతాల్లోని తూములు ధ్వంసమయ్యాయి. ప్రాజెక్టు కింది కాలువల్లో మట్టి పేరుకుపోయి తుంగ పెరిగింది.


ఇందిరానగర్ సమీపంలోని కాలువలో పెరిగిన తుంగ


నక్కలగూడ సమీపంలో ఎండిపోతున్న వరి పొలాలు


రెబ్బెన, బెజ్జూరు, పెంచికల్‌పేట, న్యూస్‌టుడే

పొట్టదశలో ఉన్న వరి పంటకు నీరందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మరో 20-30 రోజుల్లో చేతికందే సమయంలో నీరు లేక కష్టాలు మొదలయ్యాయి. వట్టివాగు ప్రాజెక్టు, చెరువులను నమ్ముకుని సాగు చేసిన వారి ఆశలు అడియాసలయ్యేలా ఉన్నాయి. ముందస్తుగా కాలువలకు మరమ్మతులు చేయకపోవడమే కారణమని వాపోతున్నారు.

జిల్లాలో వట్టివాగు ప్రాజెక్టు, చెరువులు, కుంటల కింద 56,856 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వట్టివాగు కింద 24,500 ఎకరాలకు నీరందించాల్సి ఉన్నా.. దాదాపు 8 వేల ఆయకట్టు మాత్రమే సాగవుతోంది. ప్రాజెక్టు కింద డీ-1 నుంచి డీ-12 వరకు డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. వీటి కింద రెబ్బెన మండలంలో కైర్‌గాం, ఎడవెల్లి, నేర్పల్లి, ఇందిరానగర్, నక్కలగూడ, రెబ్బెన, పుంజుమేర, తదితర గ్రామాల అన్నదాతలు సుమారు నాలుగు వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పొట్ట దశకు చేరగా.. డీ-9, డి-10 కాలువల కింది పొలాలకు నీరందడం లేదు. నక్కలగూడ, పుంజుమేరగూడ, రెబ్బెన, ఇందిరానగర్, లేతన్‌గూడ ప్రాంతాల్లో సుమారు 450 ఎకరాల వరి పంటకు పది రోజుల నుంచి నీరు రావడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు.

మరమ్మతులు చేయాలి

గాత్రే సురేష్, సింగిల్‌గూడ



ఆరెకరాల్లో వరి సాగు చేస్తున్నా. 15 రోజుల నుంచి నీరందక వరి గింజలు తప్పలవుతున్నాయి. ఇప్పుడు నీరందక పోతే పంట చేతికందే పరిస్థితి లేదు. వట్టివాగు కాలువలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలి.

ఆయిల్ ఇంజన్ ద్వారా..

గర్లపల్లి శేఖర్, బెజ్జూరు



చెరువు కింద వరి సాగు చేస్తున్నా. నీరందక పంట ఎండుముఖం పట్టింది. కనీసం పెట్టుబడి చేతికి అందాలన్న ఉద్దేశంతో ఆయిల్ ఇంజన్ ద్వారా నీటిని అందిస్తున్నా.

చర్యలు తీసుకుంటాం

గుణవంతరావు, ఇరిగేషన్ ఈఈ

వట్టివాగు జలాశయం కింద వారబందీ కొనసాగుతోంది. వరి పొలాలకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 5, 6 డిస్ట్రిబ్యూటర్లను మూసేసి డీ-9, డీ-10లకు నీరందిస్తాం. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, తుంగ తొలగించేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరైతే వెంటనే పనులు చేపడతాం.

మండలం	కాగజ్‌నగర్	బెజ్జూర్	సిర్పూర్(టి)	కౌటాల	చింతలమానేపల్లి	దహెగాం	పెంచికల్‌పేట్	రెబ్బెన	ఆసిఫాబాద్	కెరమెరి	తిర్యాణి	వాంకిడి	సిర్పూర్(యూ)	జైనూర్	లింగాపూర్	మొత్తం
వరి సాగు (ఎకరాల్లో)	8,170	7,830	6,073	6,827	4,140	8,140	3,770	6,752	1,750	3	1,710	320	467	73	831	56,856


నజ్రుల్‌నగర్ మార్కెట్ సమీపంలో..

ప్రమాదకర మూలమలుపు.. ఆపై గుంత

మండలంలోని నజ్రుల్‌నగర్ మార్కెట్ సమీపంలో ప్రమాదకరంగా మూలమలుపు ఉండగా.. అక్కడే లోతైన గుంత ఉంది. పంచాయతీ కార్యాలయానికి ఆన్‌లైన్ సేవలు అందించాలని ఓ నెట్‌వర్క్ కేబుల్ కోసం గుంత తవ్వి పూడ్చకుండా అలాగే వదిలేశారు. ఏడాది గడిచినా పూడ్చకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంచాయతీ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న ప్రమాదకర గుంతను పూడ్చే దిశగా పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

ఆర్జీయూకేటీకి మళ్లీ ఇన్‌ఛార్జి వీసీనే

● వెంకటరమణ బదిలీ
● కొత్త ఉపకులపతికి పరీక్షే

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, బాసర(ముథోల్): బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాని(ఆర్జీయూకేటీ)కి మళ్లీ నిరాశనే ఎదురైంది. శాశ్వత ఉపకులపతి నియామకం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటం ఫలించలేదు. రెండున్నరేళ్లుగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పనిచేస్తున్న ఆచార్య వెంకటరమణను బుధవారం బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో జేఎన్‌టీయూహెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యుడు ఎ.గోవర్ధన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. తొలిసారిగా 2010లో శాశ్వత ఉపకులపతిగా నియమితులైన ఖరగ్‌పూర్ విద్యావేత్త రాజ్‌కుమార్ విధి నిర్వహణ 2015 వరకు కొనసాగింది. ఆతరువాత శాశ్వత ఉపకులపతుల నియామకం ఆగిపోయింది. ఇన్‌ఛార్జిల పాలనతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. మిగిలిన విశ్వవిద్యాలయాల మాదిరిగానే కులపతిగా గవర్నర్‌ను, ఆయన పర్యవేక్షణలో శాశ్వత ఉపకులపతిని నియమించాలనే విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ఆ డిమాండ్ నెరవేరలేదు.


ఆర్జీయూకేటీ

సఫలం కాని ప్రయత్నాలు

రెండేళ్ల కిందట శాశ్వత ఉపకులపతి నియామకమే ప్రధాన డిమాండ్‌గా విద్యార్థులు చేసిన నిరవధిక ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. స్పందించిన అప్పటి ప్రభుత్వం విద్యార్థులను శాంతింపచేసేలా తొలుత 2022 జూన్‌లో ఓయూ ఆచార్యుడు సతీష్ కుమార్ డైరెక్టర్ నియమించింది. విద్యార్థుల ఆందోళన కాస్త సద్దుమణిగాక అదే ఏడాది ఆగస్టులో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆచార్య వెంకటరమణను ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమించింది. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా, ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతల కారణంగా వెంకటరమణ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పాలకుల పట్టింపులేనితనంతో ఆర్జీయూకేటీలో వ్యవస్థీకృతమైన లోపాలను సరిదిద్ది, విద్యాప్రమాణాలు పెంచటానికి ఆయన చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. పైగా విశ్వవిద్యాలయం ప్రారంభమైన 2008 నుంచి 2023 జూన్ 13 వరకు 15 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే, 2023 జూన్ 15 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆరుగురు ఆత్మహత్యలకు ఒడిగట్టడం అలజడి రేకెత్తించింది.

తాజాగా విద్యార్థులు ఆందోళనకు దిగడం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. దాంతో పాటు పదవీ కాలం రెండున్నరేళ్లు పూర్తి కావటంతో వెంకటరమణను బదిలీ చేసిన ప్రభుత్వం గోవర్ధన్‌ను నియమించింది.

సమస్యలు అనేకం

తాజాగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమితులైన ఎ.గోవర్ధన్ బాధ్యతల నిర్వహణ పరీక్షే. సవాలక్ష సమస్యలతో విద్యార్థులు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఇంటర్న్‌షిప్ లేదు. ల్యాప్‌టాప్‌లు, ఆధునిక వసతులు అందుబాటులో లేవు. ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న 90 మంది అధ్యాపకులు, వంద మంది బోధనేతర సిబ్బంది క్రమబద్ధీకరణ అంశం, శాశ్వత ఉపకులపతి కావాలనే విద్యార్థుల ప్రధాన డిమాండ్ అపరిష్కృతంగా ఉన్నాయి. అక్రమాలకు కేంద్రబిందువుగా మారాయనే మెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. ఒక్కో సమస్యను అధ్యయనం చేయటం, ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం, ఆర్జీయూకేటీలో విద్యావ్యవస్థను గాడిన పెట్టడంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ ఏమేరకు సఫలీకృతమవుతారనేది ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీఎం యాజమాన్యం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : లారీల కిరాయిలు పెంచాలని లారీ అసోసియేషన్ నిర్వాహకులు ఆందోళన బాటపట్టిన విషయం విదితమే. గత నెల 26న కాగితపు లోడ్‌తో ఉన్న అసోసియేషన్‌కు చెందిన 33 లారీలను అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిలిపివేశారు. కిరాయి పెంచే విషయంలో జిల్లా అధికారులు, మిల్లు ప్రతినిధులు, అసోసియేషన్ మధ్య జరిగిన చర్చలు ఫలించలేదు. లారీలు నిలిపివేయడంతో నష్టం వాటిల్లుతోందని మిల్లు యాజమాన్య ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్టు మిల్లు చీఫ్ మేనేజర్(హెచ్‌ఆర్) రమేష్‌రావు తెలిపారు. కాపీ అందగానే దానిని పోలీసుశాఖకు అందజేస్తామన్నారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా కాగితపు లోడ్ లారీలను పోలీసు బందోబస్తు మధ్య ఆయా ప్రాంతాలకు పంపించే ఏర్పాటు చేస్తామని మేనేజర్ పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండలంలోని బసంతినగర్ పంచాయతీలోని విలేజి నెం.3లో కొన్ని రోజులుగా రేయింబవళ్లు వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్తు బిల్లుల భారం పడుతుంది. **- సమిరన్ దేబనాథ్, స్థానికుడు**

✔ వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- ఎంపీడీఓ రమేష్, కాగజ్‌నగర్ మండలం**

సిర్పూర్(టి), న్యూస్‌టుడే:

? పేట్‌మైల వద్ద నాలాల్లో పూడికతీయక దుర్గంధం వస్తోంది. దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. రోగాలు ప్రబలుతున్నాయి.
- సాయి, పేట్‌మైల, సిర్పూర్(టి)

✔ నాలాల్లో పూడిక తీయించి శుభ్రం చేయిస్తాం. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. **- తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)**

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన డోంగ్రే హక్టయ్య(53) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 13న దుర్గాదేవీ నిమజ్జనం సందర్భంగా మండపం వద్దకు వెళ్లారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ (నెంబర్ లేనిది) వెనకాల కూర్చొని పులిహోర పంచారు. ఈక్రమంలో ట్రాక్టర్ ముందుకు కదలడంతో అతను ఒక్కసారిగా కిందపడ్డాడు. మెడ భాగంలో బలమైన దెబ్బ తగలడంతో వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి సోదరుడు డోంగ్రే వాసుదేవ్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ డోంగ్రే కాశీనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


మొక్కలు తొలగిస్తున్న అటవీ సిబ్బంది

అటవీ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజి పరిధిలోని ప్లాంటేషన్‌లో సాగుచేసిన కంది పంటను రెండో రోజైన బుధవారం అధికారులు తొలగించారు. కడంబా కంపార్టుమెంట్ 121లో పలువురు రైతుల కబ్జాలోని పోడు భూమిని అటవీ అధికారులు రెండేళ్ల కిందట తమ ఆధీనంలోకి తీసుకొని ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల అధికారులకు తెలియకుండా రైతులు కంది సాగు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఓ శశిధర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఆ మొక్కలను తొలగించారు. గురువారం నుంచి ఈ కంపార్టుమెంట్ చుట్టు కందకాలు తవ్విస్తామని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా రైతులు ఈ అటవీ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.


రైతులతో సమావేశమైన భారాస నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

పోడు భూముల సమస్య పరిష్కరిస్తా

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని పోడు భూముల సమస్యను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని భారాస రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ రైతులకు భరోసానిచ్చారు. బుధవారం అంకుసాపూర్‌లో ప్రత్యేకంగా పోడు భూముల రైతులతో సమావేశమయ్యారు. పలువురు పోడు భూములపై పట్టాలు కలిగి ఉన్నప్పటికీ ఏటా పంటల సీజన్ ప్రారంభ దశలో అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి పోడు భూముల వివాదాన్ని తేల్చకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. భారాస సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు ఆవుల రాజ్‌కుమార్ యాదవ్, నక్క మనోహర్, రామ్‌ప్రసాద్, మహమ్మద్ మినాజ్, దేవాజీ, విఘ్నేశ్వర్, తదితరులున్నారు.

అవ్వాల్ పెన్‌కు ప్రత్యేక పూజలు

కెరమెరి: జోడేఘాట్‌లో అవ్వాల్ పెన్ పూజలతో భీం వర్ధంతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భీం మనవడు సోనేరావు ఆధ్వర్యంలో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం బుధవారం రాత్రి ఆదివాసీ పెద్దల సమక్షంలో అవ్వాల్ పెన్(పోచమ్మ) ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భీం విగ్రహం, సమాధి వద్ద పూజలు చేశారు.


పూజ కార్యక్రమంలో భీం మనవడు సోనేరావు, తదితరులు

వట్టివాగు ప్రాజెక్టు రక్షణకు చర్యలు: మంత్రి

ఆసిఫాబాద్, గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : వట్టివాగు ప్రాజెక్టు రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వట్టివాగు జలాశయాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మిలతో కలిసి సందర్శించారు. సింగరేణి నిధులు రూ.11.24 కోట్లతో చేపడుతున్న రిజర్వాయర్ రక్షణ కట్ట నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాజెక్టు రక్షణకు సింగరేణి నిధులివ్వడం సంతోషంగా ఉందన్నారు. రక్షణ కట్ట నిర్మించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేలా చూస్తామన్నారు. బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ గుణంత్‌రావు తదితరులున్నారు.


ఖైరిగూర ఓసీపీ సమీపంలో వట్టివాగు రిజర్వాయర్ రక్షణ కట్ట నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జీఎం శ్రీనివాస్


వినతుల వెల్లువ..

మంత్రి సీతక్కకు పలువురు సమస్యలు పరిష్కరించాలని వినతులు సమర్పించారు. ఐకేపీ వీవోఏలకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ప్రమాద బీమా వసతి కల్పించాలని కోరుతూ.. సంఘ సభ్యులు బుద్ధ, రమేశ్, శ్రీధర్, రాజేందర్‌లు వినతిపత్రం అందించారు. జిల్లా, మండల పరిషత్తు పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు.. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని, పాఠశాలల్లో అటెండర్లుగా నియమించి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సంఘ సభ్యులు మంజూర్ అలీ, చంద్రయ్య, లింగయ్యలు మంత్రికి వినతి పత్రం అందించారు. డిజిటల్ క్రాప్ సర్వే కోసం గ్రామ స్థాయిలో సహాయకులను నియమించాలని కోరుతూ.. ఏఈవోలు మంత్రికి దరఖాస్తు అందించారు. బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ఏర్పాటు కానున్న గోలేటి ఓపెన్‌కాస్టు కోసం అటవీ అనుమతులు ఇప్పించాలని కోరుతూ.. ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు.

సంచార ప్రయోగశాల ప్రారంభం

ఆసిఫాబాద్ అర్బన్: జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క బుధవారం సంచార సైన్స్ ప్రయోగశాలను ప్రారంభించి ఆసక్తిగా పరిశీలించారు. ప్రయోగాలు, సిద్ధాంతాలపై రిసోర్సు పర్సన్లను అడిగి తెలుసుకున్నారు. వాహనాన్ని జిల్లాకు అందజేసిన భారత్ ఎలక్ట్రికల్ ప్రైవేటు లిమిటెడ్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రయోగాలను అవగాహన చేసుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యాపరంగా జిల్లాను ముందుంచాలని అధికారులు, ఉపాధ్యాయులను కోరారు. జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

నాలా.. పూడిక, పిచ్చిమొక్కలతో ఇలా!


కాలువను ఆవరించిన పిచ్చిమొక్కలు

మండల కేంద్రంలోని దక్కన్ గ్రామీణ బ్యాంకు సమీప కాలనీలో ఉన్న మురుగు కాలువల్లో నెలల నుంచి పూడిక తీయడం లేదు. చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి కాలువను కప్పేశాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్లపైకి వస్తోందని, దుర్వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఈ విషయమై కార్యదర్శి తుకారాంను సంప్రదించగా.. పూడిక, పిచ్చిగడ్డిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- న్యూస్‌టుడే, బెజ్జూరు

భీం వర్ధంతికి తరలిరావాలని పిలుపు

బెజ్జూరు, న్యూస్‌టుడే : కుమురంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించే వర్ధంతికి ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విచారణ ఖైదీల కేసులపై సమీక్ష

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని కోర్టులో బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేశ్ ఆధ్వర్యంలో విచారణ ఖైదీల కేసులపై సమీక్షించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజాతో కలిసి అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖైదీల కేసుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితులు, బెయిల్ మంజూరైనా విడుదల కాని వారు ఉన్నారా.. అన్న విషయాలపై చర్చించారు. న్యాయ సేవా సంస్థ యాక్ట్ వినియోగం, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీసీఆర్‌బీ సీఐ కేశవ్, జైలర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేశ్, చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజా

పట్టుపురుగుల సాగు అడ్డగింత

దహెగాం, న్యూస్‌టుడే : చింతలమానేపల్లి మండలం అంబగట్టు, కోర్సీని గ్రామాల గిరిజనులు సమీపంలోని అటవీ ప్రాంతంలో పట్టుపురుగులను పెంచడానికి నిర్ణయించుకున్నారు. అయితే వాటిని పెంచేందుకు అనుమతులు లేవని బుధవారం అటవీ అధికారులు అడ్డుకున్నారు. అటవీప్రాంతంలో చెట్లు, కొమ్మలను ధ్వంసం చేస్తారనే ఉద్దేశంతో అడ్డుకున్నట్లు చెప్పారు. కొన్నేళ్లుగా అటవీప్రాంతంలో మద్దిచెట్లపై పట్టు పురుగులను పెంచుతూ సుమారు 70-80 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని గిరిజనులు పేర్కొన్నారు. ఒక కుటుంబానికి దాదాపు రూ.50 వేలు ఆదాయం అందుతుందన్నారు. అడ్డుకోవడంతో జీవనాధారాన్ని కోల్పోతామని వాపోయారు. అనుమతులు తెప్పించాలని వారు అధికారులను డిమాండ్ చేయగా.. ఉన్నతాధికారులకు నివేదికలు పంపి వారి ఆదేశానుసారం నడుచుకుంటామని పేర్కొన్నారు.

ఎంవీ డ్రైవర్ ఉద్యోగాలు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థలో ఖాళీగా ఉన్న ఎంవీ డ్రైవర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మాట్లాడుతూ అంతర్గత అభ్యర్థుల కోసం 94 ఉద్యోగాల భర్తీకి 2021లో యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. కరోనా కారణం చూపుతూ వాయిదా వేసిందని తెలిపారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో ప్రస్తుత ఎంవీ డ్రైవర్లు పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, బండి రమేష్, సత్తయ్య, తదితరులున్నారు.

చిరుధాన్యాల ఆహారంతోనే ఆరోగ్యం

తిర్యాణి, న్యూస్‌టుడే: చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని యక్షి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కమల అన్నారు. బుధవారం మండలంలోని గడలపల్లిలో ప్రపంచ ఆహార దినోత్సవం పురస్కరించుకొని జై జంగుబాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల వంటకాలు వండి అతిథులకు వడ్డించారు. ప్రస్తుతం చిరుధాన్యాల పంట విస్తీర్ణం తగ్గిందని ప్రతి ఒక్క రైతు వీటి సాగు పెంచాలని సూచించారు. పేదలందరికీ ఆహారం అందించాలనే ఉద్దేశంతో స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందన్నారు. మాజీ సర్పంచులు గుణవంతరావు, రాధబాయి, జిల్లా రాయి సెంటర్ మేడీ మోతీరాం, ఆదివాసీ నాయకులు నర్సింగ రావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షురాలు కమల


మహిళా సంఘ సభ్యులకు సూచనలు చేస్తున్న జాతీయ పర్యవేక్షణ బృందం సభ్యులు, అధికారులు

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనుల పర్యవేక్షణ

జైనూర్, న్యూస్‌టుడే : నిరుపేదల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని జాతీయ పర్యవేక్షణ బృందం సభ్యులు రఘునాథన్, నాగరాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జామిని, రాసిమెట్ట గ్రామాల్లోని అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం నిధులతో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాలు, వాటర్‌షెడ్ పథకాల్లో జరిగిన పనుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు తీసుకున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పర్యవేక్షణాధికారి మల్లేష్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీఓ మోహన్, ఏపీఓ నగేష్, ఏపీఎం సుజాత, ఉపాధి, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ తెలిపారు. గత నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీల్లో జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థి ఆలం శైలజ, సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి రత్నం వంశీలు ప్రతిభ చాటినట్లు చెప్పారు. వీరిద్దరూ ఈ నెల 19 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ శంకర్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

కౌటాల, న్యూస్‌టుడే: మండలంలోని కనికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముత్యంపేట్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు నిర్వహణ శాఖ అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆధార్ అనుసంధానం చేసుకొని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీఎస్సీ కేంద్రాల లావాదేవీలు చేసుకోవాలని సూచించారు. రైతులందరూ సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు.

నూతన బాధ్యతల స్వీకరణ

బెజ్జూరు, న్యూస్‌టుడే : బెజ్జూరు వ్యవసాయాధికారిగా బానోత్ నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయ సలహాలు, సూచనలు ఇస్తామని పేర్కొన్నారు.

కౌటాల ఏఈగా ప్రేమ్‌కుమార్

కౌటాల, న్యూస్‌టుడే: కౌటాల విద్యుత్ శాఖ ఏఈగా వాంఖడే ప్రేమ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఈగా పనిచేసిన రవీందర్ బదిలీపై తిర్యాణి మండలానికి వెళ్లగా ఆయన స్థానంలో ఆసిఫాబాద్‌లో పనిచేసిన ప్రేమ్‌కుమార్ వచ్చారు. ఫోర్‌మెన్‌గా నర్సింగరావ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారిని సిబ్బంది సన్మానించారు. మాధవ్, ప్రవీణ్, చరణ్‌దాస్, తదితరులున్నారు.

బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం


సమావేశానికి హాజరైన పోలీసులు


సూచనలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కెరమెరి, న్యూస్‌టుడే : జోడేఘాట్‌లో గురువారం కుమురం భీం వర్ధంతి నిర్వహించనున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పోలీసు బలగాలతో బందోబస్తుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. వేలాదిగా జనాలు వస్తారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. దర్బార్, సభావేదిక, పార్కింగ్, భోజనాలు తదితర ప్రదేశాలలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 28 మంది ఎస్సైలు, 460 మంది పోలీసుల బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు కరుణాకర్, రామానుజన్, సీఐలు సత్యనారాయణ, రాణాప్రతాప్ పాల్గొన్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కార్మిక సంక్షేమ బోర్డులోని కొన్ని పథకాలను టెండర్ ద్వారా బీమా కంపెనీలకు అప్పగించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలు విరమించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ భవనం వద్ద కార్మికులతో కలిసి మాట్లాడారు. తెలంగాణలోని వెల్ఫేర్ బోర్డులో 2009 నుంచి భవన నిర్మాణ కార్మికులకు 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించినా, గాయపడ్డ, సహజ మరణం చెందిన కార్మిక కుటుంబాలకు పరిహారం, వివాహ, ప్రసూతి కానుకలను ఇస్తున్నట్లు వివరించారు. కానీ ఇక్కడ అమలు చేయకపోవడంతో కార్మికులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయక నిబంధనలకు విరుద్ధంగా మళ్లిస్తున్నట్లు ఆరోపించారు. ఈ నెల 18న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం మండల అధ్యక్షుడు కమలాకర్, ఉపాధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి రవి, కోశాధికారి సదయ్య, సభ్యులు ముబీన్, నరేష్, రాజన్నలు ఉన్నారు.


మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్

గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం ప్రారంభం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధిసోకే ప్రమాదం ఉన్నందున ముందస్తుగానే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి నవంబర్ 11 వరకు గాలికుంటు వ్యాధి నివారణకు షెడ్యూల్ రూపొందించారు. బుధవారం మండలంలోని సార్సాలలో 492 పశువులకు నివారణ టీకాలు వేశారు. ఇందులో 315 ఆవులు, 177 ఎడ్లు ఉన్నాయని పశువైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. పశువైద్య సహాయకులు(వీఏ) శైలేందర్, రాజ్‌కుమార్, గోపాలమిత్రలు జమీర్, రమేష్, సిబ్బంది యాదవ్, పశు వైద్యాధికారి మురళి, సిబ్బంది మోతీరాం, వినోద్, ప్రశాంత్, గజానంద్‌లు పాల్గొన్నారు.



సార్సాలలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి విజయ్‌కుమార్

ఆసిఫాబాద్: మండలంలోని చిర్రకుంటలో బుధవారం ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను జిల్లా పశువైద్య అధికారి సురేష్‌కుమార్ వేసి కార్యక్రమం ప్రారంభించారు. జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా జీవాలకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, పశు వైద్యాధికారి ... పాల్గొన్నారు.

తిర్యాణి: మండలంలోని రాంబాయిగూడ, గోయోగాం గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి సాగర్ తెలిపారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో శిబిరాలు నిర్వహించి పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 17 వేల వరకు గేదెలు, ఆవులు, ఎడ్లు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెంచికల్‌పేట్: పశువులకు రాబోయే వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని మండల పశు వైద్యాధికారి రాకేష్ అన్నారు. పెంచికల్‌పేట్, ఎల్లూర్ గ్రామాల్లో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 4 నెలలు పైబడిన పశువులు, గేదెలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సురేష్, అటెండర్ అనందరావు, శివ, శేఖర్, తదితరులున్నారు


ఎల్లూర్‌లో..


అధ్వానంగా వరండా


పైకాజీగూడ పాఠశాల దుస్థితి

రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పైకాజీగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇది. 1-5 తరగతి వరకు 18 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాలకు గోడలు తడిచి పగుళ్లు తేలి పెచ్చులు రాలుతున్నాయి. వరండాలోని ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమైంది. భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాంకిడి మండలం ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 1-5 తరగతి వరకు 74 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం మూడు గదులుండగా రెండు వినియోగంలో లేవు. ఒక దానిలోనే స్టాఫ్, విద్యార్థుల చదువులను నిర్వహిస్తున్నారు. పాఠశాల భవనం పగుళ్లు తేలి పెచ్చులు రాలిపోతున్నాయి. కొత్త భవనం లేకపోవడంతో ఇందులోనే విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి.




రాజారం పాఠశాల భవనం

రెబ్బెన మండలం రాజారం ప్రాథమిక పాఠశాల సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇక్కడ కేవలం ఎనిమిది మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయురాలు ఉన్నారు. భవనంలోని గదిలో పగుళ్లు తేలాయి. వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు.

భయం భయంగా చదువులు

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు

రెబ్బెన, న్యూస్‌టుడే:

తరగతి గదుల్లో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన విద్యార్థులు.. పగుళ్లు తేలి, వర్షాలకు నాని కూలిపోతున్న గోడలు, పెచ్చులూడుతున్న పైకప్పుల కింద బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగించాల్సిన దుస్థితి. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా కొత్తవి మంజూరు కాక శిథిలావస్థకు చేరిన బడి భవనాల్లో వర్షం కురిస్తే గదుల్లోకి నీరు చేరుతుండటంతో.. పిల్లలను బడికి పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు.

మన ఊరు-మన బడిలో దక్కని అవకాశం

రెబ్బెన మండలంలోని పైకాజీగూడ, రాజారాం పాఠశాలలు మన బడి-మన ఊరు పథకంలో ఎంపిక కాలేదు. విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉండటంతో భవనాలు శిథిలావస్థకు చేరినా ఎంపిక చేయలేదని అధికారులు చెబుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పక్కా భవనాలు మంజూరుతో పాటు మరమ్మతులు లేకపోవడంతో.. అవి అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం మంచినీటి కోసం బోర్ సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్తు వంటి పనులు కొనసాగుతున్నాయి. భవనమే కూలేందుకు సిద్ధంగా ఉంటే చిన్న చిన్న పనులు ఎందుకు చేపడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

– ఎం. వెంకటేశ్వర్, ఎంఈవో

పైకాజీగూడ, రాజారం ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇటీవలే ఎంఈవోగా బాధ్యతలు తీసుకున్నా. గతంలో ఉన్న ఎంఈవో కొత్త భవనాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. అమ్మ ఆదర్శ పథకం కింద పనులు కొనసాగుతున్నాయి.

ఈ సందర్భం ఓ మధుర జ్ఞాపకం..!!

● కొలువులో చేరిన కొత్త ఉపాధ్యాయులు

మామడ, న్యూస్‌టుడే: ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే మాటలు కాదు. తీవ్రమైన పోటీలో తమ ప్రతిభతో వేలాది మంది కన్నా ముందు నిలిస్తేనే కోరుకున్న కొలువు సొంతమవుతుంది. అందులోనూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరే అవకాశం వస్తే అంతకన్నా ఆనందం ఇంకేముంటుంది. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గురువులుగా ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరారు. టీచర్లుగా తొలిరోజు వారికి జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోయే మధుర జ్ఞాపకం. నూతనంగా బాధ్యతల్లో చేరిన పలువురు తమ అనుభూతులను ఇలా పంచుకున్నారు..



మామడ పాఠశాలలో సురేష్ పవార్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు

ఈ స్వాగతం చిరస్మరణీయం..

ఎవరికైనా బడితో అనుబంధం ఎంతో మధురంగా ఉంటుంది. అందుకే ఉన్నత స్థానాలకు చేరుకున్నా తాము చదువుకున్న పాఠశాలకు వీలైనప్పుడల్లా వెళ్తుంటారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నిత్యం మళ్లీ విద్యార్థి దశ గుర్తొస్తుందన్న అభిప్రాయాన్ని మామడ జడ్పీఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన కుంటాల మండలం అంబుగామ్‌కు చెందిన సురేష్ పవార్ వ్యక్తం చేశారు. మొదటి రోజు బడికి వచ్చిన నాకు తోటి ఉపాధ్యాయులు చెప్పిన స్వాగతం, ప్రభుత్వ కొలువు సాధించి హాజరు రిజిస్టర్లో చేసిన సంతకం అంతా ఓ కొత్త అనుభూతినిచ్చిందని సురేష్ సంబరపడ్డారు.

ఉన్న ఊరులోనే ఉపాధ్యాయురాలిగా..



పొన్కల్ పాఠశాలలో పిల్లలతో మౌనిక

దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన మౌనిక మామడ మండలం పొన్కల్‌కు చెందిన హరీష్‌ను వివాహం చేసుకున్నారు. డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికైన ఆమెకు మెట్టినిల్లైన పొన్కల్‌లోనే ఉపాధ్యాయురాలిగా పనిచేసే అవకాశం వచ్చింది. తొలి రోజు విధుల్లో చేరిన నాకు పిల్లలకు పాఠాలు చెప్పడం, సహచర ఉపాధ్యాయులను కలవడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు చక్కగా చదువు చెప్పి మంచి పేరు తెచ్చుకుంటానని ఆనందం వ్యక్తం చేశారు.

అమ్మానాన్నల దగ్గరే ఉండి మళ్లీ బడికి..

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం కేశాపూర్‌కు చెందిన లక్ష్మీ-గంగాధర్ దంపతుల కుమార్తె దివ్యరాణి. ఈమెకు నిర్మల్ మండలం నీలాయిపేటకు చెందిన మహేశ్‌తో వివాహమైంది. అప్పటి నుంచి ఆ గ్రామంలోనే ఉంటున్నారు. తాజాగా ఉపాధ్యాయురాలిగా ఎంపికైన దివ్యరాణికి సొంత జిల్లా జగిత్యాలలో పోస్టింగ్ వచ్చింది. సహజంగా చిన్నప్పుడు అమ్మానాన్నల దగ్గరుండి పిల్లలు బడికెళ్తుంటారు. ఇప్పుడు మళ్లీ తల్లిదండ్రుల దగ్గరుండి పాఠశాలకు వెళ్లే అవకాశం రావడం అదృష్టమని అభిప్రాయపడ్డారు. సొంతూరు కేశాపూర్‌కు సమీపంలోనే ఎర్దండి ప్రాథమిక పాఠశాలలో ఆమె విధుల్లో చేరారు. గురువుగా అంకిత భావంతో పని చేస్తానని, పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ఒక ఉపాధ్యాయురాలిగా తొలిరోజు ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.



విధుల్లో చేరే ముందు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న దివ్యరాణి

మొన్నటి దాకా నిరుద్యోగులు..

జీవితంలో ఎత్తుపల్లాలు సహజం. ఉద్యోగం లేక చిన్నాచితక పనులు చేసుకుంటూ నిరుద్యోగులుగా ఎన్నో కష్టాలు పడ్డ వారు ఉద్యోగులుగా మారిన క్షణాన్ని ఎలా మరిచిపోగలరు. ఓ కొత్త జీవితానికి నాంది పలికిన సందర్భం ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రణాళిక, పట్టుదల, క్రమశిక్షణతో అడుగులు వేసే వారికి ఆలస్యంగానైనా మంచి ఫలితాలు వస్తాయని యువత తమ ప్రతిభతో నిరూపిస్తున్నారు.

నేనే మీ ఊరి కొత్త టీచర్ను..

నిర్మల్‌కు చెందిన అభిలాష్ ఇన్నాళ్లూ మామడ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. తాజాగా ఉపాధ్యాయునిగా ఎంపికైన ఆయనకు పెంబి మండలం అంకెన గ్రామపంచాయతీ పరిధిలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలను కేటాయించారు. మొదటి రోజు ఆ ఊరికి వెళ్లిన అభిలాష్ గ్రామస్థులను కలిశారు. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అనుభవంతో పాఠశాలను చక్కగా తీర్చిదిద్దుతానన్నారు. సమాజంలో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరడం అదృష్టంగా భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. జీవితంలో ఇది గుర్తుండి పోయే రోజని ఆనందం వ్యక్తం చేశారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న అభిలాష్

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతా..



ఝరి పాఠశాలలో తొలిరోజు విద్యార్థులకు పాఠం చెబుతున్న మోహన్

మామడ మండలం గొండుగూడకు చెందిన మోహన్ తాండూరు మండలం ఝరి తండా పాఠశాలలో బాధ్యతలు తీసుకున్నారు. సొంతూరులో మొదటి ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. మారుమూల తండా పాఠశాలలో పనిచేసే అవకాశం వచ్చిందని, బాధ్యతలు చక్కగా నిర్వర్తించి అక్కడి పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతానన్నారు. ఇన్నాళ్లూ నిరుద్యోగిగా ఎంతో కష్టపడ్డాను..ఇప్పుడు ఉపాధ్యాయునిగా ఇష్టంగా పని చేసి మంచి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. కొత్తగా విధుల్లో చేరిన సందర్భంలో ఆనందబాష్పాలు వచ్చాయని ఈ రోజు ఎంతో ప్రత్యేకంగా నిలిచి పోతుందన్నారు.

హత్య కేసులో 16 మందికి జీవిత ఖైదు, జరిమానా

క్రైం కార్నర్

రెబ్బెన, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం సింగిల్‌గూడ గ్రామానికి చెందిన ఆజ్మీర రమేష్ హత్యకు కారణమైన 16 మందికి జీవిత ఖైదు, రూ.1,49,000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ డి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. 2020 ఆగస్టు 19న రమేష్ సోదరి రాజేశ్వరి తన ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన జర్పుల సురేష్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో సోదరుడు రమేష్, ఆయన కుమారుడు లోకేష్ ఇంటి నుంచి బయటకు రావడంతో సదరు వ్యక్తి పారిపోయాడు. అనంతరం రమేష్ ఇతర పనులకు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో.. విషయాన్ని మనసులో పెట్టుకున్న సురేష్ 15 మందితో కలిసి వెంట తెచ్చుకున్న గొడ్డలితో రమేష్‌ను తలపై నరికారు. మిగిలిన వారు రాజేశ్వరి, భార్య రేణుకలపై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ రమేష్ మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై అప్పటి రెబ్బెన ఎస్సై డి.రమేష్ మొదటి ఇన్వెస్టిగేషన్ అధికారిగా నియామకమయ్యారు. జర్పుల సురేష్, జర్పుల సత్యవతి, ఆజ్మీర వసంత్‌రావు, జర్పుల తిక్యనాయక్, జర్పుల హరీశ్, ఆజ్మీర అరవింద్, ఆజ్మీర నవీన్, ఆజ్మీర ప్రవీణ్, ఆజ్మీర సంతోష్, ప్రవీణ్‌కుమార్, జర్పుల లక్ష్మి, జర్పుల రజిత, జర్పుల తుకారం, జర్పుల రవి, జర్పుల రాజు, జర్పుల బిక్యానాయక్‌లపై మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ లైజనింగ్ అధికారి (ఏఎస్సై) రామ్‌సింగ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఉమేశ్వర్ కోర్టులో 16 మంది నిందితులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు వాదించారు. న్యాయమూర్తి జి.వి రమేష్ శిక్ష విధించినట్లు ఎస్పీ వివరించారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో ఆదిలాబాద్‌కు చెందిన జమీల్‌ఖాన్(25)కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ పోక్సో కోర్టు బుధవారం తీర్పును వెలువరించింది. లైజన్ అధికారి జి.పండరి వివరాల మేరకు.. పట్టణంలోని ఒక కాలనీకి చెందిన బాలికకు, ఆమె తమ్ముడికి చదువు చెప్పే జమీల్‌ఖాన్ తన ఇంట్లో శుభకార్యం ఉందని చెప్పి 2021 ఫిబ్రవరి 14న సాయంత్రం 5.30కు బాలికను, ఆమె తమ్ముడి(4)ని ఇంటికి తీసుకెళ్లాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వారిని దిగబెట్టడానికి బయలుదేరి మధ్యలో వాహనాన్ని ఆపి బాధితురాలి తమ్ముడికి చరవాణి ఇచ్చి బాలికను పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తరువాత వారిని ఇంటి వద్ద దింపగా బాలిక ఏడుస్తూ విషయాన్ని తల్లికి చెప్పింది. వారు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రామకృష్ణ కేసును నమోదు చేశారు. ఈ కేసులో కోర్టు విధుల పోలీసు అధికారి ఠాకూర్ రవీందర్‌సింగ్ ప్రవేశపెట్టిన 14 మంది సాక్షులను ప్రత్యేక పీపీ విచారించి నేరాన్ని రుజువు చేశారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.శివరాంప్రసాద్ పైమేరకు తీర్పునిచ్చారు.

దివ్యాంగుడిపై లైంగిక దాడి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : దివ్యాంగుడిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన యువకుడు(20) ఈ నెల 13న రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడిని(32) పక్కనే ఉన్న పంట పొలానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడికి రక్తస్రావం కావడంతో గమనించి కుటుంబ సభ్యులు ఆరా తీశారు. విషయం తెలియడంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసరలో గంగాహారతి




గోదావరినదికి హారతి ఇస్తున్న అర్చకులు

ముథోల్(బాసర): దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం బాసర గోదావరి నది వద్ద గంగాహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేకపూజలు చేసిన అనంతరం గోదావరి నదికి హారతి ఇచ్చారు. బాసర గ్రామస్థులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గోదావరి నది వద్ద భక్తుల సందడి కనిపించింది. కార్యక్రమంలో ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావు, వేదపండితులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక.. కుమురం భీం

● నేడు జోడేఘాట్‌లో వర్ధంతి



ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, కెరమెరి

అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్‌లో పుట్టి ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన కుమురం భీం.. జీవితం, పోరాటం అడుగడుగునా వీరోచితం. వనాలతో మమేకమైన బతుకులతో ఆటలాడుతున్న నిజాం సైన్యానికి నూనుగు మీసాల వయసులోనే వెన్నులో వణుకు పుట్టించిన గోండు బెబ్బులి. గెరిల్లా పోరాటాల్లో తోటి వారికి తర్ఫీదునిచ్చి గ్రామాలను ఒక్కటిగా చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వీరుడు. నమ్మక ద్రోహ చర్యలో అసువులు బాసిన ఆయనను మరోసారి స్మరించుకునేందుకు ప్రజలందరి అడుగులు గురువారం (17న) జోడేఘాట్ వైపే సాగనున్నాయి.

తుపాకీ శిక్షణ కోసం

అధికారి మరణంతో ఆదివాసీలపై అధికారుల నిర్బంధం ఎక్కువయ్యాయి. చదువు లేకపోవడంతో జరిగే అనర్థాలు తెలుసుకున్న భీం.. ఈక్రమంలో జల్, జంగల్, జమీన్ లక్ష్య సాధనలో చదువుతో పాటు తుపాకీ పేల్చడం నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. 1935లో కోవ అర్జు, మడావి కొద్దు, కుమ్ర లచ్చులతో కలిసి అసోం ప్రాంతానికి వెళ్లారు. తుపాకీ వాడకం నేర్చుకుని మూడేళ్ల తర్వాత తిరిగి సొంత ప్రాంతానికి వచ్చారు.

తుడుం మోగించి.. ఒక్కటి చేసి



జోడేఘాట్‌కు వెళ్లే దారి

సాగు భూములపై హక్కులతో పాటు, పన్నుల రద్దు గురించి భీం 1938 నుంచి పోరాటం ఉద్ధృతం చేశారు. నిజాం తాలుకాదార్ అబ్దుల్ సత్తార్ (అప్పటి కలెక్టర్)తో నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో.. ఉద్యమం క్రమంగా సాయుధ పోరాటంగా మారింది. ఈక్రమంలో కెరమెరి మండలంలోని టోకెన్ మోవాడ్, లైన్‌పటార్, బాబేఝరి, శివగూడ, పిట్టగూడ, కల్లెగాం, పట్నాపూర్, చాల్‌బడి, పాటగూడ, చిన్న పట్నాపూర్, గోండుగూడ, కొపగూడ గ్రామాల్లోని ప్రజలందరినీ ఏకం చేశారు. తుడుం మోగించి జోడేఘాట్ వద్ద సమావేశపర్చేవారు. వీరి సహకారంతో పోరు సాగుతున్న తరుణంలో ఆయనను ఎలాగైనా అణచివేయాలని నిజాం పోలీసులను రంగంలో దించారు. కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో భీం ఉన్న స్థలాన్ని పసిగట్టి కాల్పులు జరపగా.. 1940న తుదిశ్వాస విడిచారు.

పోరాటం వైపు పయనం..



ప్రస్తుత కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం పాత రౌట సంకెపల్లిలో 1900 అక్టోబరు 22న మైనుబాయి-చిన్ను దంపతులకు కుమురం భీం జన్మించారు. చిరుప్రాయంలోనే తండ్రి చనిపోవడంతో కుటుంబం సుర్దాపూర్ ప్రాంతానికి వలస వెళ్లింది. అటవీ పుత్రులైన గిరిజనులపై ఆ సమయంలో నిజాం ప్రభువు రకరకాల పన్నులు వసూలు చేసేవారు. దీనిపై వారిలో అసహనం వ్యక్తమైనా ఎవరైె ధైర్యం చేయలేని పరిస్థితులు. భీం సాగు చేసిన పంట చేతికొచ్చిన తరుణంలో పంటను కాజేయడానికి అటవీ అధికారి సిద్దిక్ రాగా.. వారిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అధికారిని కర్రతో కొట్టి చంపిన భీంకు 15 ఏళ్లు ఉండటం గమనార్హం. ఇదే ఆయన పోరాటానికి ఆరంభం.



మ్యూజియం

గిరిజన ప్రగతికి సంస్కరణలు..

భీం ప్రాణత్యాగంతో కళ్లు తెరిచిన నిజాం ఆదివాసీల అభ్యున్నతి కోసం సంస్కరణలు చేపట్టారు. ప్రఖ్యాత మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్‌ను నియమించింది. గిరిజనులతో ఆయన మమేకమై వారి స్థితిగతులపై అధ్యయనం చేసి, అభివృద్ధికి మార్గనిర్దేశనం చేశారు. ఆయన సూచనలతోనే అటవీ భూమిని రెవెన్యూ భూమిగా మార్చుతూ ఉత్వర్వులు వచ్చాయి.

- జైనూర్ మండలం దబోలిలో 40వేల అటవీ భూముల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 1.60 లక్షల ఎకరాలు గిరిజనులకు పంపిణీ
- గిరిజనుల భూ బదలాయింపు నిషేధిత చట్టం, గిరిజన ప్రాంతాల రెగ్యులరైజేషన్‌కు రూపకల్పన
- తిర్యాణి మండలంలో గిన్నెధరి, మర్లవాయిలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల ఏర్పాటు
- ఆదివాసీ ప్రాంతాల్లో 30 నూతన పాఠశాలల ఏర్పాటు
- గిరిజన తెగలు, గిరిజన ప్రాంతాలను నోటిపైడ్‌గా ప్రకటన
- ఐటీడీఏలు, గిరిజన సహకార సంఘాల ఏర్పాటు



స్మృతివనం

ఏఈవోలకు తాఖీదులు


ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)పై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిజిటల్ సర్వే చేయాల్సిన ఏఈవోలు తమకు పని భారం అవుతుందని సర్వేకు దూరంగా ఉన్నారు. ఆగ్రహించిన ఉన్నతాధికారులు ఉమ్మడి జిల్లా మొత్తం ఏఈవోలకు మెమోలు జారీ చేశారు. డిజిటల్ సర్వే అంటే పంట పొలానికి వెళ్లి సంబంధిత వ్యవసాయ సిబ్బంది ఫొటో తీసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే అనేక పనులతో తలమునకలై ఉన్నామని, ఈ పనికి సహాయకుడిగా మరో వ్యక్తిని నియమించాలని ఏఈవోలు కోరారు. ప్రభుత్వం ఒప్పుకోకపోగా.. డిజిటల్ సర్వేను పూర్తి చేయాలని తిరిగి ఆదేశించింది. అయినా సర్వే చేయడం కుదరదంటూ రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులుగా ఏఈవోలు సర్వేకు దూరంగా ఉన్నారు. సర్వే మినహా ఇతర పనులు పూర్తి చేస్తున్నా.. ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం చేశారంటూ.. అందరికి మెమోలు జారీ చేసింది.

పల్లెదారులకు రూ.15 కోట్లు మంజూరు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15.07 కోట్లు మంజూరు చేసింది. ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం, ఉట్నూరు, ఖానాపూర్ మండలాల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలకు నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉట్నూరు మండలంలోని చాపరాల నుంచి మత్తడిగూడ వరకు 5 కి.మీ.ల రోడ్డు నిర్మాణానికి రూ.5.15 కోట్లు, శంభుగూడ నుంచి సుహినూర్ వరకు 3 కి.మీ రహదారికి రూ.3.24 కోట్లు, జన్నారం నుంచి నర్సింగాపూర్ వరకు 3 కి.మీ రోడ్డుకు రూ.2.94 కోట్లు, పీడబ్ల్యూడీ రహదారి నుంచి నర్సింగాపూర్‌కు రూ.2.50 కోట్లు, ఇదే రహదారిపై కల్వర్టులకు రూ.54 లక్షలు, ఖానాపూర్ మస్కపూర్ వయా చర్చి రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు.

సూర్యప్రతాపం


● ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణంలో మార్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నైరుతి రుతుపవనాల కాలం పూర్తి అయినప్పటికీ మరో నెల రోజులపాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అడపాదడపా జిల్లావ్యాప్తంగా రాత్రి కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురుస్తున్నా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం 35 నుంచి 40 డిగ్రీల నడుమ కొనసాగుతుండటం గమనార్హం. దీంతో మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఆరోగ్యాల మీద ప్రభావాన్ని చూపుతున్నాయి. -న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

మరో మూడు రోజులు ఇవే తిప్పలు

ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు వేసవిని తలపిస్తూ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సాయంత్రం 4 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఉక్కపోతతో జిల్లావాసులు సతమతం అవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో చాలా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగనున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. గడిచిన వారం రోజులుగా ఎండల తీవ్రత కొనసాగుతుండగా రానున్న మూడు రోజులపాటు కూడా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 38 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల మధ్య కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఆరోగ్య సమస్యలు

అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లావాసులు వివిధ రకాల ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కబోత కారణంగా చర్మ సంబంధిత వ్యాధులు పీడిస్తున్నాయి. కొంత మంది ఒళ్లు, కండరాల నొప్పులతోపాటు గొంతు నొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు.

14 రోజులు.. రూ.19.42 కోట్లు

● ఆర్టీసీకి దసరా, బతుకమ్మ పండగ సెలవుల్లో ఆదాయం



ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : దసరా, బతుకమ్మ పండగలు ఆర్టీసీకి కాసులు కురిపించాయి. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం, ఉద్యోగులు, వ్యాపారులు సొంతూళ్లకు బయల్దేరేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది. రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా నడిచే బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం కలిసివచ్చింది. ఈనెల 1 నుంచి 14 తేదీ వరకు రూ.19.42 కోట్ల ఆదాయం సమకూరింది. 12, 13 తేదీలలో వరుసగా రూ.72.70 లక్షలు, రూ.89.55 లక్షలు మినహాయిస్తే రోజూ సగటున రూ.1.38 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది దసరా సీజన్‌లో 12 రోజుల్లో రూ.11.81 కోట్ల ఆదాయం వచ్చింది.

ఈ నెల 1 నుంచి 14 వరకు వివరాలు

డిపో	మొత్తం ప్రయాణికులు	మహాలక్ష్ములు	ఆదాయం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	7,05,631	3,77,368	4.02
భైంసా	5,95,744	3,56,985	1.99
నిర్మల్	8,80,500	5,73,128	4.96
ఉట్నూరు	1,95,237	1,21,929	0.90
ఆసిఫాబాద్	5,68,995	3,85,795	2.85
మంచిర్యాల	8,27,740	5,02,679	4.68

61 శాతం మహిళా ప్రయాణికులే

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలున్నాయి. ప్రత్యేకంగా హైదరాబాదుకు 412 బస్సులను ఏర్పాటు చేశారు. రీజియన్ వ్యాప్తంగా బస్సులను ప్రతిరోజు సగటున 2.45 లక్షల కిలోమీటర్ల మేర నడిపారు. 14 రోజుల్లో మొత్తంగా 34.34 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిచాయి. మొత్తంగా 37.73 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశారు. అందులో ఛార్జీలు చెల్లించిన ప్రయాణికులు 14.55 లక్షల మంది కాగా మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించిన మహిళలు 23.17 లక్షల మంది కావడం గమనార్హం.

తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు

- సోలోమన్, రీజినల్ మేనేజరు, ఆర్టీసీ

దసరా, బతుకమ్మ పండగలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. సెలవులు ముగిసినందున తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా అన్ని డిపోల నుంచి బస్సులను నడుపుతున్నాం.